యూనిట్
I

# 1. శాంతికాంక్ష

– తిక్కన సోమయాజి

## చదవండి - ఆలోచించండి - చెప్పండి

అది 1945వ సంవత్సరం. రెండో ప్రపంచ యుద్ధంలో అమెరికా జపాన్‌లోని హిరోషిమా అనే నగరం మీద అణుబాంబులతో దాడి చేసింది. దాని ఫలితంగా క్షణాల్లో అరవైఆరువేలమంది ప్రాణాలు కోల్పోయారు. డెబ్భై వేలమంది క్షతగాత్రులయ్యారు. నిన్న మొన్నటి వరకూ అక్కడి ప్రజలకు అది పీడకలగానే మిగిలిపోయింది.

### ప్రశ్నలు

1. దీన్ని బట్టి మీకేమర్థమైంది?
2. మానవ కళ్యాణానికి ఉపయోగపడాల్సిన సైన్సు దేనికి దారితీసింది?
3. ఈనాటి ఆధునిక కాలంలో యుద్ధాలవల్ల ఎలాంటి నష్టాలు సంభవిస్తాయి?
4. యుద్ధాలను నివారించడానికి శాంతిని నెలకొల్పడానికి ఏం చేయాలి?

© SCERT not to be republished

### నేపథ్యం

మహాభారతం అన్నదమ్ముల బిడ్డలైన కౌరవపాండవుల కథ. కౌరవులు కుటిల బుద్ధితో మాయాజూదంలో పాండవులను ఓడించి అడవులపాలు చేస్తారు. పందెం ప్రకారం పన్నెండేళ్ళు అరణ్యవాసం, ఒక సంవత్సరం అజ్ఞాతవాసం పూర్తి చేస్తారు పాండవులు. ఆ సందర్భంలో ధర్మరాజు శ్రీకృష్ణుని రాయబారిగా పంపిస్తూ శాంతియుతంగా తమ రాజ్యం తమ కిమ్మని కోరుతాడు.

ప్రస్తుత పాఠ్యభాగం తిక్కన రచించిన మహాభారతంలోని – ఉద్యోగపర్వం–తృతీయాశ్వాసం లోనిది.

### విద్యార్థులకు సూచనలు

1. పాఠం చదవండి. తెలియని పదాలకు అర్థాలను తెలుసుకోండి.
2. చిత్రాలను చూసి, సందర్భాన్ని అనుసరించి, ఆలోచించి భావాన్ని గ్రహించండి.
3. పాఠంలో తెలియని విషయాలు గాని, తెలుసుకోవలసిన అంశాలు గాని మీ ఉపాధ్యాయుడితో చర్చించండి, తెలుసుకోండి.


క. ఆపదcగడవం బెట్టcగ
నోపి శుభంబైన దాని నొడcగూర్పను మా
కీ పుట్టువునకుc బాండు
క్ష్మాపాలుcడు నిన్నుcజూపి చనియె మహాత్మా ! 1

తే. సమయమిది మిత్రకార్యంబు చక్కcజేయ
నీకతంబున నే మవినీతుcడైన
యా సుయోధను తోడి పోరాట దక్కి
యనుభవింతుము మా యంశమగు ధరిత్రి. 2

క. ఇచ్చుటి బంధులు నీవును
నచ్చెరువడి వినుచునుండ **నయిదూళ్ళును** మా
కిచ్చినను జాలునంటినిc
బొచ్చెముగా దింతవట్టు పూర్ణము సుమ్మీ ! 3

**పాండవులు కోరిన ఐదూళ్లు**

1. ఇంద్రప్రస్థం,
2. కుశస్థం,
3. వృకస్థలం
4. వాసంతి,
5. వారణావతం



© SCERT to be republished

*శా. ఆ దుర్యోధనుఁడంత మాత్రయును జేయంజాలఁడో కాని, పెం
పేదం గ్రూరత కోర్వరాదు, సిరి నాకేలందునే, గ్రాసవా
సోదైన్యంబులు వచ్చు నాయరయునీ చుట్టాలకుం, గావునన్
మోదంబందుట గల్గుఁ గౌరవులు నేముం బొంది శ్రీవొందినన్. 4

*ఉ. అక్కట! లాతులైనఁ బగతైనను జంపన కోరనేల? యొం
డొక్క తెఱంగు లేదె? యది యొప్పదె? బంధు సుహృజ్జనంబు లా
దిక్కున నున్నవారు, గణుతింపక సంపదకై వధించి దూ
ఱెక్కుట దోషమందుటను నీ దురవస్థల కోర్వ వచ్చునే ? 5

క. కాన నవశ్యముఁ బెనఁకువ
గాని యుపాయమునఁ బగఱఁ గడతేర్చు ధృతిం
బూని నడచునెవ్వఁడు డెం
దానం జెయివెట్టికొని యఁతడు నిద్రించున్ 6

*ఆ.వె. పగయ కలిగెనేనిఁ బాము న్న యింటిలో
నున్న యట్ల కాక యూఱడిల్లి
యుండునెట్లు చిత్త మొకమాటుఁగావున
వలవదధిక దీర్ఘ వైరవృత్తి 7

*చ. పగయడఁగించు టెంతయు శుభం, బది లెస్స, యడంగునే పగం
బగ? వగగొన్న మార్కొనక పల్కక యుండఁగ వచ్చునే ? కడుం
దెగ మొదలెత్తి పోవఁ బగ దీర్పఁగ వచ్చినఁ గ్రౌర్యమొందు, నే
మిగతిఁ దలంచినం బగకు మేలిమి లేమి ధ్రువంబు గేశవా! 8

*ఉ. కావున శాంతిఁ బొందుటయ కర్జము, దా నదియట్టులుండె, శ్రీ
గావలెనంచుఁ, బోరితము గామియుఁ గోరెద, మెల్ల సొమ్ములుం
బోవుటయుం గులక్షయము వుట్టుటయున్ వెలిగాఁగ నొండుమై
నేవిధినైనఁ జక్కఁబడు టెంతయు నొప్పుఁజుమీ జనార్దనా ! 9

*చ. మనమునఁ బక్షపాతగతి మాదెస మానుము ధర్మనీతి వ
ర్తనముల రెండు దిక్కుల హితంబును బెంపును గల్గునట్టి చొ
ప్పున విదురాది సజ్జనుల బుద్ధికి రా నుచితంబు తోడి మె
ల్పునఁ బరుసందనంబునను భూపతులెల్ల నెఱుంగ నాడుమీ! 10

©SCERT
not to be republished

చ. తగవునఁ బోక రాజు బెడిదంబులు వల్కిన యేని సైఁచి యొ
ప్పగ నిలుమీ, గురుత్వముఁ బ్రభుత్వమునుం గల పెద్ద వారి మా
ట గొనమి యా సుయోధను కడన్ నిలువన్ మనమెల్ల గారవం
బుగఁ గురువృద్ధుపల్కుఁ దలఁపుం జననిచ్చిన మెచ్చరే జనుల్ ? 11

మ. సుతువాఁడై వినయంబు సేకొనక యే చొప్పున్ దగం జెప్ప కా
ధృతరాష్ట్రుం డవినీతిఁ జేసినను సంధింపంగ రాదంచు వే
గ తెగంబాఱకు తెంపుసేయునెడ లోకం బెల్ల మెచ్చం బ్రకా
శిత ధర్మ స్థితి నొంది మా మనము నిశ్చింతంబుగాఁ జేయుమీ ! 12




ఆ.వె. మేలుగాక నీకుఁ బోలినట్లయిన నం
దరిగి యేము వారు నర్థిఁ బొంది
యుండునట్లు గాఁగ నొడఁబాటు గావింపు
మెల్ల భంగి మనకు నిదియ లెస్స 13

క. మమ్మెఱుఁగు, దెదిరి నెఱుఁగుదు
నెమ్మి యెఱుఁగు దర్థ స్థితి నెఱి యెఱుఁగుదు వా
క్యమ్ముల పద్ధతి నెఱుఁగుదు
పొమ్మెవ్వఁడ నేను నీకు బుద్ధులు సెప్పన్ 14

©SCERT not to be republished

**కవి పరిచయం**



**తిక్కన** (ఊహాచిత్రం)

మహాభారతాన్ని తెలుగులో కవిత్రయం వారు (ముగ్గురు కవులు) రచించారు. వారిలో తిక్కన రెండోవారు. వీరు13వ శతాబ్దానికి చెందిన మహాకవి. నెల్లూరును పరిపాలించిన మనుమసిద్ధికి మంత్రిగా, ఆస్థానకవిగా ఉన్నారు. తిక్కన మొట్టమొదట 'నిర్వచనోత్తర రామాయణము'ను రచించి మనుమసిద్ధికి అంకితం ఇచ్చారు. తిక్కన రెండోగ్రంథం 'మహాభారతం'. విరాటపర్వం నుండి స్వర్గారోహణ పర్వం వరకు 15 పర్వాలు రచించి హరిహరనాథునికి అంకితం ఇచ్చారు.

మహాభారత రచనలో ఈయన తీర్చిదిద్దిన పాత్రలు సజీవంగా కనిపిస్తాయి. వీరి శైలిలో 'నాటకీయత' ఉంటుంది. సందర్భానుగుణంగా వీరు ప్రయోగించిన పదాలు సృష్టించిన సన్నివేశాలు రసాస్వాదన కలిగిస్తాయి. ఔచిత్యవంతంగా రసపోషణ చేయగలడాన్ని 'రసాభ్యుచితబంధం' అంటారు. ఇందులో తిక్కన సిద్ధహస్తుడు. సంస్కృతాంధ్రాలలో కవిత్వం రాయగలిగిన ప్రతిభాశాలి కాబట్టి 'ఉభయకవి మిత్రుడు' అనీ, కేతనాది కవులకు ప్రేరణ కలిగించి మార్గదర్శకులుగా నిలిచినందుకు 'కవిబ్రహ్మ' అనీ బిరుదులు పొందారు.

**ప్రక్రియ- ఇతిహాసం**

'ఇతిహాసం' అనే పదానికి 'ఈ విధంగా జరిగింది' అని అర్థం. ఇతిహాసం లోని ఇతి వృత్తం వాస్తవంగా జరిగినదై ఉంటుంది. రామాయణ మహాభారతాలు మన ఇతిహాసాలు

## భావాలు

### ధర్మరాజు కృష్ణునితో పలికిన మాటలు

1. ఓ మహాత్మా! కష్టాలను తొలగించడానికీ శుభాలను సమకూర్చడానికీ సమర్థుడవైన నిన్ను ఈ జన్మకు మాకు దిక్కుగా చూపి, మా తండ్రి పాండుమహారాజు వెళ్ళిపోయాడు.
2. కృష్ణా! మిత్రులమైన మాపని చక్కబెట్టడానికి నీకిది తగిన తరుణం. నీవు రాయబారానికి వెళ్తే అయోగ్యుడైన ఆ దుర్యోధనునితో మేము యుద్ధం చేయవలసిన అవసరం రాదు. మాకు రావలసిన రాజ్యం మాకు దక్కుతుంది.
3. కృష్ణా! నాచుట్టూ ఉన్న బంధువులూ నీవూ ఆశ్చర్యపడ్డా – 'సక్రమంగా మాకు అర్థరాజ్యం పంచి ఇవ్వడానికి మా తండ్రి మనస్సొప్పకపోతే మేము తలదాచుకోవడానికి ఐదూళ్ళిచ్చినా చాలు' అని సంజయుడితో నేనింతవరకూ చెప్పిన మాటలలో దాపరికం లేదు.
4. ఆ దుర్యోధనుడు నేనడిగిన ఐదూళ్ళయినా ఇస్తాడో! ఇవ్వడో! తెలియదు. కాని గౌరవం చెడేటట్లు క్రూర కార్యాచరణకు నా మనసు ఒప్పుకోదు. పోనీ రాజ్యసంపద నాకెందుకని వారిని అడగటం మానితే,నన్ను ఆశ్రయించుకొని ఉన్న నా బంధుజనులకు కూటికీ గుడ్డకూ దైన్యం ఏర్పడుతుంది. కాబట్టి కౌరవులూ, మేమూ కలసిమెలసి ఉండి రాజ్యసంపద పంచుకొంటే ఉభయులకూ సంతోషం సమకూరుతుంది.
5. అయ్యో! వారు ఇతరులైనా, విరోధులైనా చంపాలని ఎందుకు కోరాలి. పోరాటం కంటే మరో మార్గం లేదా? ఆ మార్గం మంచిది కాదా! కౌరవులలో మా బంధువులూ మిత్రులూ ఉన్నారు. కేవలం రాజ్యంకోసం అందరినీ సంహరిస్తే పాపాలు మూటగట్టుకొనక తప్పదు. నిందలుపడక తప్పదు. ఇహపరాలకూ దూరమైతే నేను తట్టుకోలేను.
6. యుద్ధం అన్ని అనర్థాలకూ మూలమవడంచేత, యుద్ధం చేయకుండానే ఉపాయంతో విరోధులను అణచివేయాలి. అటువంటి ధైర్యం వహించి ఎవడు ప్రవర్తిస్తాడో వాడు గుండెమీద చేయి వేసుకొని నిశ్చింతగా నిద్రిస్తాడు.
7. శత్రుత్వమంటూ ఏర్పడితే పామున్న ఇంటిలో కాపురమున్నట్లే. ఒక్క క్షణమైనా మనశ్శాంతి ఉండదు. కాబట్టి ఎవరితోనూ (దీర్ఘకాల) విరోధం తగదు.
8. విరోధాన్ని అణచి వేయడం ఎంతో శ్రేయస్కరం. అది మంచిపని. విరోధం వల్ల విరోధం సమసిపోదు. ఒకడు వైరం వహించి ఎదుటివాడిని బాధపెడితే వాడు ఏనాటికైనా పగతీర్చుకోవడానికే చూస్తాడు. మరలా వాడితో తలపడకుండా ఊరకుండడం సాధ్యం కాదు. అలాగని పగను నిర్మూలించడానికి పూనుకుంటే దారుణ కృత్యాలు చేయవలసి వస్తుంది. కాబట్టి ఎన్ని విధాల ఆలోచించినా పగవల్ల కీడేగాని మరే ప్రయోజనమూ లేదు. ఇది నిజం.
9. వైరంవల్ల ప్రయోజనం శూన్యం. కలతలేక నిమ్మళంగా ఉండడమే తగినది. కృష్ణా! నేను యుద్ధం జరగకుండా ఉండాలనీ సంపద కావాలనీ కోరుకుంటున్నాను. యుద్ధం వల్ల ధననష్టం,వంశనాశనం జరుగుతాయి. ఈ రెండు నష్టాలూ కలగకుండా ఆలోచించడం సముచితం కదా!

10. ఓ కృష్ణా! మా విషయంలో పక్షపాతం చూపవద్దు. ధర్మాన్నీ నీతినీ అనుసరించి ఇరుపక్షాలవారికి మేలు, అభివృద్ధి సమకూరే రీతిలో, విదురుడు మొదలైన సత్పురుషుల మనసులకు సమ్మతమయ్యేటట్లుగా, తగినంత మెత్తదనంతోనూ, కఠినమైన మందలింపులతోనూ కురుసభలో రాజులందరూ గ్రహించేటట్లు మాట్లాడు.

11. న్యాయమెంచక దుర్యోధనుడు పరుషంగా మాట్లాడినా ఓర్పు వహించు. తొందరపడి సభ విడిచి రావద్దు. పెద్దరికం, రాచరికంగల పెద్దల మాట సుయోధనుడు వినలేదనే నింద అతని తలపైనే వేయవలసింది. గౌరవంగా కురువృద్ధులైన భీష్మాదుల మాటలనూ, ఉద్దేశాలనూ ఓర్పుతో విన్నట్లైతే లోకులు మనలను మెచ్చుకుంటారు.

12. ఆ ధృతరాష్ట్ర మహారాజు తన కుమారుడి పక్షం వహించి, తన అభిప్రాయం వెల్లడించక అవినీతితో మెలిగినపుడు, ఇక ఏ మాత్రం సంధి పొసగదని వెంటనే సాహసించ వద్దు. సాహసించాల్సి వస్తే ప్రజలంతా కొనియాడేటట్లు ధర్మంమీదే నిలిచి, నాకు ఆనందాన్ని కలగజేయి.

13. ఓ కృష్ణా! కురుసభకు వెళ్ళడం నీకు యుక్తమని తోస్తే వెళ్ళి, మేమూ వారూ కలిసిమెలసి ఉండేటట్లు సంధి కుదుర్చు. అన్ని విధాలా వారితో సంధి కుదర్చడం మంచిది.

14. ఓ కృష్ణా! పాండవులూ కౌరవులూ ఎట్లాంటివారో ఎరుగుదువు. కూర్మి అంటే ఎలాంటిదో ఎరుగుదువు. కార్యసాధన విధానమెలాంటిదో ఎరుగుదువు. మాట్లాడే విధానమేమిటో నీకు తెలుసు. నీకు ఉపాయాలు చెప్పడానికి నేనేపాటి? హస్తినకు వెళ్ళిరా......

© SCERT not to be republished

## ఇవి చేయండి

## I. అవగాహన -ప్రతిస్పందన

### అ) కింది అంశాలను గురించి చర్చించండి.

1. శ్రీకృష్ణుణ్ణి కష్టాలను తొలగించే వ్యక్తిగా ధర్మరాజు కీర్తించాడు గదా ! ఎందుకన్నాడో చర్చించండి.
2. యుద్ధాలవల్ల కలిగే నష్టాలూ. అనర్థాలూ చెప్పండి.

### ఆ)* గుర్తున్న పద్యాలకు ప్రతిపదార్థాలు రాయండి.

ఉదా॥ *శా. ఆ దుర్యోధనుఁడంత మాత్రయును జేయంజాలఁడో కాని, పెం
పేదం గ్రూరత కోర్వరాదు, సిరి నాకేలందునే, గ్రాసవా
సోదైన్యంబులు వచ్చు నాయరయునీ చుట్టాలకుం, గావునన్
మోదంబందుట గల్గుఁ గౌరవులు నేముం బొంది శ్రీవొందినన్.

ప్రతిపదార్థం

| | | |
|---|---|---|
| ఆ దుర్యోధనుడు | = | ఆ దుర్యోధనుడు |
| అంతమాత్రయును | = | ఆ మాత్రమైనా (ఐదూళ్ళు ఇవ్వడమైనా) |
| చేయన్ +చాలడు+ఓ | = | చేయ లేడేమో |
| కాని | = | కాని |
| పెంపు | = | అధికమైన |
| ఏదన్ | = | నాశనం (కల్గే) |
| క్రూరతకు | = | దుర్మార్గానికి (నేను) |
| ఓర్వరాదు | = | సిద్ధపడలేను |
| సిరి | = | రాజ్యం |
| నాకు+ఏల | = | నాకెందుకు |
| అందునే | = | అంటే |
| నాన్+అరయు | = | నేను బాగోగులు చూసుకోవలసిన |
| ఈ చుట్టాలకున్ | = | ఈ ఆశ్రితులకు (పరివారానికి, బంధువులకు) |
| గ్రాసవాసః | = | తిండికి, నివాసానికి, (బట్టకు) |
| దైన్యంబులు | = | లోటు |
| వచ్చు | = | కల్గుతుంది |
| కావునన్ | = | కాబట్టి |
| కౌరవులున్ | = | కౌరవులు |
| ఏము | = | మేము |
| శ్రీ | = | రాజ్యాన్ని |
| పొందినన్ | = | పొందినట్లైతే (పంచుకున్నట్లైతే) |
| మోదంబు | = | (అందరికీ) సంతోషం |
| అందుట+కల్గు | = | కల్గుతుంది (కదా!) |

అని ధర్మరాజు శ్రీకృష్ణునితో అన్నాడు.

**ఇ) కింది పేరాను చదివి ఎలా, ఎందుకు? అనే ప్రశ్నపదాలను మాత్రమే ఉపయోగించి కొన్ని ప్రశ్నలు తయారు చేయండి.**

మనసుకు నచ్చిన పనులే పిల్లలు ఇష్టంగా చేస్తారు. కఠినంగా మాట్లాడితే పిల్లలకు నచ్చదు. కాబట్టి అలా మాట్లాడేవారికి దూరంగా ఉంటారు. పిల్లలు అద్భుతంగా ఆలోచిస్తారు. కొందరు తల్లిదండ్రులు పిల్లల్ని అర్థం చేసుకోలేక అనవసరంగా బాధపడుతూంటారు. తమకు స్వేచ్ఛ ఉన్నచోటనే నిర్భయంగా ప్రశ్నిస్తారు. భద్రత ఉందని భావిస్తేనే స్వేచ్ఛగా ఉంటారు. మనసువిప్పి మాట్లాడతారు.

**ఈ) పాఠం చదివి కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

1. ధర్మరాజు రాజ్యసంపద దేనికోసం కోరాడు?
2. శత్రుత్వభావనను కవి దేనితో పోల్చాడు?
3. ధర్మరాజు శ్రీకృష్ణునికి చాకచక్యంగా ఎలా మాట్లాడమని సలహా ఇచ్చాడు?

© SCERT not to be republished

## II. వ్యక్తీకరణ – సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు ఐదు వాక్యాల్లో జవాబులు రాయండి.**

1. 'పాముున్న ఇంటిలో కాపురమున్నట్లే' అంటే ఏమిటి? ధర్మరాజు ఈ వాక్యాన్ని ఎందుకు చెప్పాడు?
2. 'ఎవరితోనూ దీర్ఘకాలం విరోధం మంచిదికాదు' దీనిమీద మీ అభిప్రాయమేమిటి?
3. 'కార్యసాధన' అంటే అనుకొన్నది సాధించడం. ధర్మరాజు మాటల్ని బట్టి ఈ కార్యసాధనను మనం ఎలా సాధించాలి?
4. మాట్లాడే విధానం అంటే ఏమిటి? కార్యసాధకుడికి ఉండాల్సిన లక్షణాలు ఏమిటి?

**ఆ) కింది ప్రశ్నలకు పదిహేను వాక్యాల్లో జవాబులు రాయండి.**

1. ధర్మరాజు శాంతి వచనాలను సొంతమాటల్లో రాయండి.
2. ధర్మరాజు యుద్ధంవల్ల కలిగే నష్టాలు చెప్పాడు గదా! ఈ రోజుల్లో కూడా యుద్ధాలు జరుగుతున్నాయి. యుద్ధాలు రాకుండా ఉండటానికి చేపట్టాల్సిన చర్యలేమిటి?

**ఇ) సృజనాత్మకంగా రాయండి.**

పగ ప్రతీకారం మంచివి కాదనీ, శాంతియుత జీవనం గొప్పదనీ మీ మిత్రునికి లేఖ రాయండి.

(లేదా)

'శాంతి' ఆవశ్యకతను తెలియజేసేలా ఒక 'కరపత్రాన్ని' తయారుచేయండి.

**ఈ) ప్రశంసాత్మకంగా రాయండి.**

ప్రపంచశాంతి కోసం పాటుపడిన 'నెల్సన్‌మండేలా', 'గాంధీ', 'యాసర్ అరాఫత్' వంటి వారి వివరాలు సేకరించి, వారిని అభినందిస్తూ ఒక వ్యాసం రాయండి. దాన్ని చదివి విన్పించండి.

(లేదా)

మీ ఊరిలో ఏవైనా గొడవలు జరిగితే వెంటనే స్పందించి, గొడవలు వద్దు అని సర్దిచెప్పే పెద్దవాళ్ళ గురించి, 'నలుగురూ శాంతియుతంగా సహజీవనం చేయాలి' అని 'శాంతికోసం' పాటుపడేవాళ్ళని గురించి అభినందిస్తూ కొన్ని వాక్యాలు రాయండి.

## III. భాషాంశాలు

### పదజాలం

**అ) కింద గీతగీసిన పదాలకు అర్థాలు రాసి, వాక్యాల్లో ప్రయోగించండి.**

1. గురువులు శుభంబైన వాటిని సమకూర్చెదరు. ____________________
2. దీర్ఘవైరవృత్తి మంచిది కాదు. ____________________
3. శ్రీకృష్ణుడు అన్ని విషయాలు ఎఱుక గలవాడు. ____________________

**ఆ) కింది వాక్యాలను పరిశీలించి, గీతగీసిన పదాలకు నానార్థాలు రాయండి.**

1. రెండు దిక్కుల న్యాయం చెప్పడానికి నీవే మాకు దిక్కు.
2. ఒక రాజు దివినేలు నొక రాజు భువి నేలు నొక రాజు రాత్రిని యేలు నిజము.

© SCERT not to be republished

3. వైరి పక్షములోని పక్షి, పక్షమునకు గాయమై, పక్షము రోజులు తిరుగలేకపోయెను.

4. పాఠానికి సంబంధించిన మరికొన్ని పదాలకు నానార్థాలను నిఘంటువులో వెతికి, పై విధంగా వాక్యాలలో ప్రయోగించండి.

**ఇ) కింద గీతగీసిన పదాలకు పర్యాయపదాలు రాసి, వాక్యాలలో ప్రయోగించండి.**

ఉదా : ప్రేమ్, సంతోష్ ప్రాణస్నేహితులు :

(i) స్రవంతికి సంగీత, రాధికలు మంచి నేస్తాలు.

(ii) మిత్రులు ఆపద్బాంధవులు.

1. అనుకున్నది సాధించినపుడు మోదం కల్గుతుంది.

2. ధరిత్రి పుత్రిక సీత.

3. పోరితము నష్టదాయకం.

## వ్యాకరణం

**అ) పాఠం చదవండి. కింద తెల్పిన సంధులకు సంబంధించిన ఉదాహరణలను వెతికి రాయండి. సూత్రాలు కూడా రాయండి.**

1. సవర్ణదీర్ఘసంధి　　2. సరళాదేశ సంధి

3. ఇత్వ సంధి　　4. యడాగమసంధి

**ఆ) కర్మధారయ సమాసం.**

'నల్ల కలువ' అనే సమాస పదంలో నల్ల, కలువ అనే రెండు పదాలున్నాయి. మొదటి పదం 'నల్ల' విశేషణం. రెండో పదం 'కలువ' నామవాచకం. ఇలా విశేషణానికీ, నామవాచకానికీ (విశేష్యానికీ) సమాసం జరిగితే దాన్ని 'కర్మధారయసమాసం' అంటారు.

**1. విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం.**

విశేషణం పూర్వపదంగా (మొదటిపదంగా) ఉంటే ఆ సమాసాన్ని "విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం" అంటారు.

ఉదా : తెల్లగుర్రం – తెల్లదైన గూర్రం

తెలుపు – విశేషణం (పూర్వపదం – మొదటిపదం)

గుర్రం – నామవాచకం (ఉత్తరపదం – రెండవపదం)

**2. విశేషణ ఉత్తరపద కర్మధారయ సమాసం.**

'మామిడి గున్న' అనే సమాసంలో మామిడి, గున్న అనే రెండు పదాలున్నాయి. మొదటి పదం (పూర్వపదం) 'మామిడి' – నామవాచకం. రెండోపదం (ఉత్తరపదం) 'గున్న' విశేషణం. ఐతే విశేషణమైన 'గున్న' 'ఉత్తరపదం'గా (రెండోపదంగా) ఉండడం వల్ల దీన్ని 'విశేషణ ఉత్తరపద కర్మధారయ సమాసం' అంటారు.

© SCERT not to be republished

కింది పదాలు చదవండి. విగ్రహవాక్యాలు, ఏ సమాసమో రాయండి.

1. పుణ్యభూమి 2. మంచిరాజు 3. కొత్తపుస్తకం 4. కార్మికవృద్ధుడు 5. పురుషోత్తముడు

ఇ) ఛందస్సు

1. కింది పద్య పాదాలకు గణవిభజన చేసి, అవి ఏ పద్యపాదాలో తెల్పి, లక్షణాలను రాయండి.

i. కావున శాంతిఁబొందుటయ కర్జము దానది యట్టులుండె శ్రీ

ii. పగయడగించు టెంతయు శుభం బదిలెస్సయడంగునే పగం

2. శార్దూలం

| U U U | I I U | I U I | I I U | U U I | U U I | U |
|---|---|---|---|---|---|---|
| ఆ దు ర్యో | ధనుడం | త మాత్ర | ము ను జే | యం జా ల | డో గా ని | పెం |

పై గణ విభజనను పరిశీలించండి. ఇలా మ,స,జ,స,త,త,గ అనే గణాలు వరుసగా ప్రతీపాదంలో వస్తే అది 'శార్దూల' పద్యం అవుతుంది. అన్ని వృత్తపద్యాలలాగా దీనికీ ప్రాసనియమం ఉంటుంది. యతి – 13వ అక్షరానికి చెల్లుతుంది. (ఆ–య)

మీరు కూడా మిగిలిన పాదాలకు గణ విభజన చేసి పై లక్షణాలు సరిపోయాయో లేదో చూడండి. (పాఠంలోని 4వ పద్యం)

ఉ) అలంకారాలు

i. ఇంతకుముందు తరగతులలో 'ఉపమాలంకారం' గురించి తెలుసుకున్నారు కదా! ఈ పాఠంలోని ఉపమాలంకారానికి సంబంధించిన ఉదాహరణను రాసి, వివరించండి.

ii. గతంలో తెలుసుకున్న 'వృత్యనుప్రాస' ను గూర్చి ఆ అలంకార లక్షణం రాసి, ఉదాహరణలు రాయండి.

**ప్రాజెక్టు పని**

ప్రపంచశాంతి కోసం కృషిచేసిన వారి వివరాలు సేకరించండి.
వారి గురించి ఒక నివేదిక తయారు చేసి ప్రదర్శించండి.



శాంతి రాయబారం బలహీనత కాదు – మారణహోమం రాజనీతి కాదు

– డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్

© SCERT not to be republished